# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 05.06.2025 | 24 క్యారెట్లు 94,215.00 | కిలో వెండి 1,07,689.00 | 36 °C | సంపుటి:3 | సంచిక:216

www.vishalabharati.com




## జులై 21 నుంచి పార్లమెంట్
# వర్షాకాల సమావేశాలు

- జులై 21 నుంచి ఆగస్టు 12 వరకు
- పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పై చర్చకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని విపక్షాలు డిమాండ్
- రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని కేబినెట్ తేదీల ఖరారు
- పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

విశాలభారతి, స్టేట్ బ్యూరో: పార్లమెంటు వర్షాకాల సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జులై 21 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమై వర్షాకాల సమావేశాల తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని విపక్షాలు

..మిగతా 2 లో

# కేసీఆర్‌కు నోటీసులు... కాంగ్రెస్ కుట్ర

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా నోటీసులు ఇచ్చిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. తెలంగాణకు నీళ్లు, నిధులు తీసుకురావటం కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజులు కాదని.. 21పంపు హౌస్‌లు, కాళేశ్వరంతో 35శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు వస్తున్నాయని స్పష్టం చేశారు.



- నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు.. నోటీసులు ఇవ్వడాన్ని సహించం
- పెద్ద ప్రాజెక్టు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణమే
- కుంగిన మేడిగడ్డ పిల్లర్‌కు రిపేర్ చేయాలి
- చంద్రబాబు ఏపీకి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే.. రేవంత్ రెడ్డి మౌనంగా ఉన్నారు
- నోటీసులపై ఇందిరాపార్క్ వద్ద జాగృతి ఆధ్వర్యంలో ధర్నా
- ధర్నాకు దూరంగా బీఆర్ఎస్ నేతలు:ఎమ్మెల్సీ కవిత

విశాలభారతి, స్టేట్ బ్యూరో: బుధవారం ఇందిరాపార్క్ వద్ద జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత ధర్నా నిర్వహించారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా ఆమె ధర్నా చేశారు. అయితే ఈ ధర్నాకు బీఆర్ఎస్ నేతలు దూరంగా ఉన్నారు. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు కేసీఆర్‌కు నోటీసులిస్తే.. పోరాటం చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్‌పై కవిత పరోక్ష విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో కవిత మాట్లాడారు.నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు.. రేవంత్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని సహించమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు ఏపీకి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే.. మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆపమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదా అని నిలదీశారు. వెంటనే రేవంత్‌రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్,

..మిగతా 2 లో

# రాహుల్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం



- బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- నరేందర్ కా సరెండర్ అంటూ కాంగ్రెస్ విమర్శలు
- సిందూర్ విజయాన్ని చిన్నబుచ్చేలా ఆయన మాటలు
- చైనా, పాక్‌ల పెయిడ్ ఏజెంట్‌లా రాహుల్
- బీజేపీ నేతలు ఎద్దేవా

2 లో



## ఆర్సీబీ సంబురాల్లో విషాదం..

- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట
- తొక్కిసలాటలో 11 మంది దుర్మరణం
- అంచనకు మించి తరలివచ్చిన అభిమానులు
- ఆర్సీబీ జట్టుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు
- తొక్కిసలాట ఘటనపై న్యాయవిచారణ కమిషన్
- 15 రోజులు గడువు ఇచ్చిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- తప్పు మాదె క్షమించండి.. కర్ణాటక ప్రభుత్వం క్షమాపణ

*బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట చోటుచేసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవం కార్యక్రమం సందర్భంగా ఈ పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏండ్లల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా, 50 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.*

..మిగతా 2 లో



## నిరంతరం విద్యుత్తు సరఫరా

- రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఆటోమేటెడ్ జనరేటర్లు
- విద్యుత్ సరఫరాల అత్యవసర పరికరాలు అందుబాటులో ఉండాలి
- ఆస్పత్రులలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

2 లో

# మార్చి 1నుంచి జనగణన

- దానితోపాటే కులగణన.. కేంద్రం నోటిఫికేషన్
- ప్రతికూల ప్రాంతాల్లో 2026 అక్టోబర్ 1 నుంచే ప్రక్రియ
- దీని ఆధారంగానే లోక్‌సభ,అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన
- దక్షిణాది రాష్ట్రాలకు 26 సీట్లు మైనస్
- చివరిసారిగా 2011లో జనగణన

విశాలభారతి, స్టేట్ బ్యూరో: జనగణనపై కేంద్ర ప్రభుత్వం కీలక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తదుపరి దేశవ్యాప్త జనగణనను 2027 సంవత్సరంలో నిర్వహిస్తామని వెల్లడించింది. ఈసారి జనగణనతో పాటే తొలిసారిగా కులగణన కూడా నిర్వహిస్తామని తెలిపింది. బుధవారం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్‌లో నూ ఈవిషయాన్ని ప్రస్తావించింది. నోటిఫికేషన్ ప్రకారం, జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్నారు. దీనికి సూచన తేదీగా 2027 మార్చి 1ని పరిగణించనున్నారు. అయితే లడఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచుతో కప్పబడిన, సమకాలీకరించని ప్రాంతాల్లో



ముందుగానే జనాభా గణనను నిర్వహిస్తారు. ఇలాంటి ప్రాంతాల్లో జనగణన నిర్వహణకు సూచన తేదీగా 2026 అక్టోబర్ 1ని నిర్ణయించారు. 2027లో కుల గణనతో పాటు జనగణన నిర్వహించే

..మిగతా 3 లో



## రేపు లాసెట్

- మూడు సెషన్లలో నిర్వహణ
- 57,715 మంది అభ్యర్థులు హాజరు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రంలో వివిధ లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ లాసెట్, పీజీ ఎల్ సెట్ పరీక్షలను ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నారు. శుక్రవారం ఒకే రోజు మూడు సెషన్లలో ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షల కోసం మొత్తం 57,715 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మూడేండ్ల ఎల్ఎల్బీ కోర్సులో అడ్మిషన్ల కోసం ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు

..మిగతా 2 లో

# ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు

- పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలి
- కంపెనీ టెంట్లు, కంటైనర్ డబ్బాలకు రైతుల నిప్పు
- పనిచేసేందుకు వచ్చిన కార్మికులను తిప్పి పంపిన వైనం
- రాజోలి మండలం పెద్ద ధన్వాడలో ఉద్రిక్తత
- కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఆందోళన

విశాలభారతి, స్టేట్ బ్యూరో: జోగులాంబ గద్వాల జిల్లా పెద్దధన్వాడలో ఇథనాల్ పరిశ్రమఏర్పాటును వ్యతిరేకిస్తూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని ఆందోళన కొనసాగిస్తుంటే పనుల ప్రారంభానికి యాజమాన్యం సన్నాహాలు చేయడం స్థానికుల ఆగ్రహానికి కారణమైంది. పనులు అడ్డుకునేందుకు వెళ్లిన స్థానికులను పోలీసులు నిలువరించగా ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వాదం ఉద్రిక్తతకి దారితీసింది. కోపోద్రిక్తులైన రైతులు కంటైనర్లను తగులపెట్టారు. వాహనాలు ధ్వంసంచేశారు. పనులు చేసేందుకు వచ్చిన కార్మికుల్ని తిప్పి పంపారు. రెండున్నర గంటల



తర్వాత పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా చుట్టుపక్కల 12 గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పరిశ్రమ పనులు

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
05.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily



## రేపు లాసెట్

తరువాయి భాగం: నిర్వహించే లాసెట్ కు 20719 మంది, మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకు జరిగే పరీక్షకు 20491 మంది హాజరవ్వనున్నారు. ఇకపోతే ఐదేండ్ల ఎల్ఎల్బీ, రెండేండ్ల ఎల్ఎల్ఎం కోర్సు కోసం జరిగే లాసెట్, పీజీఎల్ సెట్ పరీక్ష సాయంత్రం 4 గంటల నుంచి 5:30గంటల వరకు జరగనుంది. ఐదేండ్ల ఎల్ఎల్ బీ కోసం 11695 మంది, ఎల్ఎల్ఎం కోసం 4810 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా 76 కేంద్రాల్లో తొలి రెండు సెషన్లకు సంబంధించిన ఎగ్జామ్స్ జరగనున్నాయి. 65 సెంటర్లలో మూడో సెషన్ కు సంబంధించిన ఎగ్జామ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను https://lawcet.tsche.ac.in వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు లాసెట్ కన్వీనర్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు.

# కేసీఆర్‌కు నోటీసులు... కాంగ్రెస్ కుట్ర

తరువాయి భాగం:

కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణమేనని తెలిపారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్‌కు రిపేర్ చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు మీద ఆధారపడి బీజేపీ.. కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బనకచర్ల ప్రాజెక్ట్ గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ అయినా ఈ విషయంపై మాట్లాడాలని కోరారు. రైతులు, జాగృతి తరుపున మాట్లాడాలని ఈటలకు విజ్ఞప్తి చేశారు. నోరు కట్టేసుకుని అపవాదు తెచ్చుకోవద్దని ఈటల రాజేందర్‌ను కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఈటల రాజేందర్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు. గోదావరిలో వెయ్యి టీఎంసీల నీళ్లు వచ్చేవరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు.హైదరాబాద్‌కు శాశ్వతంగా నీటి అవసరాలు తీరుతాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టే.. కాళేశ్వరం కట్టారని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ కలలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టు కట్టలేదని ఎద్దేవా చేశారు. ప్రాణహిత చేవెళ్ల పేరుతో.. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16టీఎంసీలు మాత్రమే తెలంగాణకు కేటాయించారని వివరించారు. కేసీఆర్ ..141 టీఎంసీలు తెలంగాణకు నిల్వ ఉండాలని కాళేశ్వరం కట్టారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారని విమర్శించారు. పర్మిషన్ ఉన్నప్పటికీ.. జాగృతి ధర్నాకు పోలీసులు ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ప్రశ్నించారు. బైండోవర్ పేరుతో అరెస్టులు చేయటాన్ని ఆపాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు.

# రాహుల్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'నరేందర్, సరెండర్' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి తెరలేపాయి. దీనిపై బుధవారం కాంగ్రెస్, బీజేపీ మధ్య వాగ్యుద్ధం నడిచింది. మంగళవారం భోపాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. భారత్‌పాకిస్థాన్ సైనిక ఘర్షణ సమయంలో ట్రంప్ పిలుపు తర్వాత మోదీ లొంగిపోయారని ఆయన ఆరోపించారు. "ట్రంప్ ఫోన్ చేసి, మోదీజీ మీరేం చేస్తున్నారు? నరేందర్ లొంగిపోండి అని అన్నారు. ఆ మాటలనే ప్రధాని మోదీ పాటించారు. గత చరిత్రలోనూ ఇలాంటి ఉదాహరణలు ఉన్నాయి. ఇది బీజేపీ ఆర్ఎస్ఎస్‌ల లక్షణం. వాళ్లు ఎల్లప్పుడూ తలవంచుకొని లొంగిపోతారు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్ ద్వారా భారత సాయుధ దళాలను రాహుల్ అవమానించారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చిన్నబుచ్చేలా ఆయన మాటలు ఉన్నాయన్నారు. పాక్‌కు మద్దతుగా మాట్లాడటంలో పాక్ ఆర్మీ చీఫ్, దాని ప్రధాన మంత్రి, ఉగ్రవాద సంస్థల సూత్రధారులను రాహుల్ గాంధీ మించిపోయారని సుధాంశు త్రివేది ధ్వజమెత్తారు. భారతదేశ సాయుధ దళాల పరాక్రమాన్ని కించపరిచేలా మాట్లాడుతున్న రాహుల్ గాంధీని రాహుల్ మునీర్, రాహుల్ షరీఫ్ అని పిలవాల్సి ఉంటుందన్నారు. రాహుల్ వ్యాఖ్యలు అనారోగ్యకరమైన, ప్రమాదకరమైన మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆరోపించారు. "విపక్ష పార్టీలది పేరుకే ఇండియా కూటమి. కానీ వాళ్ల మనసుల్లో పాకిస్థాన్ ఉంది. పరిపక్వత లేని విధంగా రాహుల్ నోరుపారేసుకుంటున్నారు. లోక్‌సభ విపక్ష నేత హోదాకు తగిన విధంగా ఆయన ప్రవర్తన లేదు" అని సుధాంశు త్రివేది అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటు ప్రత్యేక సెషన్‌ను నిర్వహించాలని కోరుతూ మంగళవారం జరిగిన ఇండియా కూటమి భేటీలోనూ విపక్ష నేతలు ఇలాగే మాట్లాడారని విరుచుకుపడ్డారు. ఇలాంటి విషపూరిత వ్యాఖ్యలు చేయడం ద్వారా విపక్ష నేతల ముసుగులు తొలగిపోయి నిజస్వరూపాలు బయటపడ్డాయన్నారు. సుధాంశు త్రివేది, బీజేపీ భారత్, పాక్ సైనిక ఘర్షణల సమయంలో మధ్యవర్తిత్వం వహిస్తాననే ట్రంప్ ప్రతిపాదనను భారత ప్రభుత్వం తిరస్కరించిందని సుధాంశు త్రివేది స్పష్టం చేశారు. "నమ్మశక్యం కాని వ్యాఖ్యలు చేయడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మొదటి నుంచే అలవాటు. 2020లోనే అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చనిపోయారని, ఆయన స్థానంలో రోబోటిక్ క్లోన్‌ను అందరికీ చూపిస్తున్నారనే ఒక కుట్ర సిద్ధాంతాన్ని గతంలో ట్రంప్ తెరపైకి తెచ్చారు" అని సుధాంశు గుర్తుచేశారు. కాగా, చైనా, పాకిస్థాన్‌లకు పెయిడ్ ఏజెంట్ అనే అనుమానాన్ని రేకెత్తించేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని బీజేపీ ఎంపీ, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా కామెంట్ చేశారు. బీజేపీ విమర్శలను కాంగ్రెస్ పార్టీ బలంగా తిప్పికొట్టింది. "గత 11 సంవత్సరాలుగా బీజేపీ వాళ్లు 'ముఖద్దర్ కా సికందర్' సినిమా తీస్తున్నారు. తీరా సినిమా రెడీ అయ్యాక అది 'నరేందర్ కా సరెండర్' అని తేలింది.

# నిరంతరం విద్యుత్తు సరఫరా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్ల పనితీరు వాటి సామర్థ్యంపై చర్చించారు, రాష్ట్రవ్యాప్తంగా జనరేటర్ సౌకర్యం లేని ఆసుపత్రుల్లో ఆటోమేటెడ్ జనరేటర్లను సమకూర్చుకోవడానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని సచివాలయంలో ప్రభుత్వ ఆసుపత్రులలో నిరంతరం విద్యుత్తు సరఫరాపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆసుపత్రుల్లో విద్యుత్ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజినీర్లను నియమించుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాల అవసరమైన అత్యవసర పరికరాలను, సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఆస్పత్రులలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా జిల్లా వైద్య శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యాలతో పాటు కొవిడ్ టెస్ట్ కిట్స్‌ను, అవసరమైన మందులను కొనుగోలు చేయాలని టీజీఎమ్ఎస్ఐడీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకొని శానిటేషన్పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మందుల కొరత లేకుండా అవసరమైన మందులను కొనుగోలు చేయాలన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా చొంగ్తు, ఎస్పీడీసీఎల్ ఎండీ ముషరఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ ఎండీ వరుణ్ రెడ్డి, టీజీఎమ్మెస్ ఐడీసీ ఎండి ఫణిందర్ రెడ్డి, కాళోజి నారాయణరావు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నందకుమార్ రెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డా. అజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

# ఆర్సీబీ సంబురాల్లో విషాదం..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



అంతకు ముందు ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తీక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

**తొక్కిసలాట ఘటనపై న్యాయవిచారణ కమిషన్**

బెంగళూరు తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందినట్లు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ధ్రువీకరించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. తొక్కిసలాటలో గాయపడిన వారికి ఉచిత వైద్యం అందిస్తామని వెల్లడించారు. తొక్కిసలాట నేపథ్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీఎం సిద్ధరామయ్య మాట్లాడారు. స్టేడియం సామర్థ్యం 35 వేలు అయితే 2 లక్షల మంది వచ్చారని, తొక్కిసలాట దురదృష్టకరమన్నారు. తొక్కిసలాట ఘటనపై న్యాయవిచారణకు ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. విచారణ కమిషన్‌కు 15 రోజులు గడువు విధించారు. మృతుల్లో ఎక్కువగా యువత ఉన్నారని, స్టేడియం గేట్లు బద్ధలుకొట్టుకొని అభిమానులు దూసుకొచ్చారని తెలిపారు.బెంగళూరులో జరిగిన తొక్కిసలాట ఘటన ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఈ ఘటనపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బెంగళూరులో జరిగిన దుర్ఘటన హృదయ విదారకమైనదని, ఈ కష్ట సమయంలో తమ ప్రియమైనవారిని కోల్పోయిన కుటుంబాల పట్ల సానుభూతి వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. దీంతోపాటు మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.

**రెండు లక్షల మందికిపైగా..**

బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ వేడుకల్లో జరిగిన తొక్కిసలాట భయానక దృశ్యాల్ని మిగిల్చింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 11 మంది మరణించారు. ఈ విషాదకర ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా స్పందించారు. ఈ వేడుకలకు మేము ఊహించలేని విధంగా జనాలు వచ్చారని సీఎం అన్నారు. స్టేడియం సామర్థ్యం 35,000 మంది కాగా, అనూహ్యంగా రెండు నుంచి మూడు లక్షల మంది హాజరయ్యారని వెల్లడించారు. అంత భారీగా జనాలు రావడం వల్ల సరైన ఏర్పాట్లు చేయడానికి సమయం సరిపోలేదని సీఎం సిద్ధరామయ్య వివరించారు. ఇదే సమయంలో సీఎం మెజిస్ట్రేట్ స్థాయి విచారణకు ఆదేశించారు. దీంతోపాటు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం, గాయపడినవారికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ప్రభుత్వం బాధితులకు పూర్తిగా సపోర్ట్ చేస్తుందని సీఎం హామీ ఇచ్చారు.,

**తప్పు మాదె క్షమించండి.**

**- ఆర్సీబీ విక్టరీ పరేడ్ తొక్కిసలాటపై కర్ణాటక ప్రభుత్వం క్షమాపణ**

బెంగళూరు లోని చిన్నస్వామి స్టేడియం వద్ద చోటుచేసుకున్న తొక్కిసల పై కర్ణాటక ప్రభుత్వం స్పందించింది. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ క్షమాపణలు చెప్పారు. ఆర్సీబీ అభిమానులు బారీగా తరలిరావడంతో అదుపు చేయలేకపోయామని, వైఫల్యం తమదేనని ఆయన చెప్పారు.,మరోవైపు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య క్షతగాత్రులు చికిత్స పొందుతున్న బౌరింగ్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధిలందరికీ సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా ఐపీఎల్ 2025 కప్పు గెలిచిన ఆర్సీబీ ఆటగాళ్లు ఇవాళ బెంగళూరుకు చేరుకున్నారు. దాంతో కర్ణాటక క్రికెట్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో వారికి సన్మానం చేసేందుకు చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దాంతో వారిని అదుపుచేయడం అక్కడున్న పోలీసులకు సాధ్యంకాలేదు. అభిమానులు బారికేడ్‌లను తోసుకుని స్టేడియంలోకి పరుగులు తీశారు. దాంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో ఆరుగురు మరణించారు. దాదాపు 50 మంది గాయపడ్డారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# జులై 21 నుంచి పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు

తరువాయి భాగం

డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ సహా 16 పార్టీల ఎంపీలు మంగళవారం ప్రధాని నరేంద్రమోదీకి లేఖ కూడా రాశాయి. అలా ప్రత్యేక సమావేశాల కోసం డిమాండ్ పెరుగుతున్న వేళ వర్షాకాల సమావేశాలపై కేంద్ర నిర్ణయం తీసుకుంది.

నిబంధనల ప్రకారం అన్ని అంశాలపై వర్షాకాల సమావేశాల్లో చర్చిస్తామని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఎప్పటిలాగే లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఉదయం 11 గంటలకు సమావేశమవుతాయని చెప్పారు. కాగా, పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్పై చర్చలకు ప్రతిపక్షాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం ఉంది. అయితే 2025లో జనవరి 31వ తేదీ ఏప్రిల్ 4వ తేదీ మధ్యలో రెండు దశల్లో బడ్జెట్ సమావేశాలు జరిగాయి. అప్పుడే ఉభయసభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమెదం పొందింది. ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదంతో బిల్లుగా మారింది. ఏప్రిల్ 8వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఆ సమావేశాల్లో త్రిభువన్ సహకారి విశ్వ విద్యాలయ బిల్లు 2025 కూడా ఆమెదం పొందింది.

# ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దు

తరువాయి భాగం

ప్రారంభించేందుకు మంగళవారం రాత్రి పెద్దఎత్తున కార్మికులు, కంటైనర్లు, వాహనాలు, గుడారాల్ని మోహరించింది. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తుంటే మళ్లీ పనులు ఎలా ప్రారంభిస్తారని రైతులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగారు. ఎవరూ పరిశ్రమ పరిసరాలకి రావొద్దని, పనులను అడ్డుకోవద్దని ఇథనాల్ పరిశ్రమ సిబ్బంది స్థానికులకు సూచించారు. పరిశ్రమ ఏర్పాటుని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సుమారు 12 గ్రామాల రైతులు, ప్రజలు ఫ్యాక్టరీ వద్ద పనులను అడ్డుకునేందుకు యత్నించగా భారీఎత్తున మోహరించిన పోలీసులు వారిని నిలువరించారు. ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. కోపోద్రిక్తులైన రైతులు ఒక్కసారిగా కర్రలతో దాడులకు తెగబడ్డారు. పరిశ్రమ కంటైనర్లు ధ్వంసం చేశారు. ఓ కంటైనర్‌కి నిప్పుపెట్టి గుడారాలు, టెంట్లు తొలగించారు. అక్కడ పనిచేసేందుకు వచ్చిన కార్మికులను తిప్పి పంపారు. భారీగా ఆందోళనకారులు తరలిరాగా సుమారు రెండున్నర గంటల తర్వాత పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.పెద్దధన్వాడలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మొదటినుంచి వ్యతిరేకిస్తూ వస్తున్నారు. సుమారు 10 నెలలుగా ఆ పరిశ్రమ అనుమతి రద్దు చేయాలని పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసునూరు, మాన్‌దొడ్డి, నౌరోజిక్యాంపు, చిన్నతాండ్రపాడు, వేణిసోంపూర్, కేశవరం లాంటి 12 గ్రామాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. ఇథనాల్ పరిశ్రమవస్తే జల, వాయు, నేలకాలుష్యం పెరుగుతుందని, పంటలు పండవని, అనారోగ్య సమస్యలు వస్తాయని స్థానికుల ఆరోపణ. ఈ మేరకు ఊరూరా ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక కమిటీలు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ నుంచి కలెక్టర్ వరకి వినతిపత్రాలిచ్చారు. జిల్లాకు వచ్చిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను కలిసి అనుమతి రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. జనవరి ఫిబ్రవరిలో 20 రోజులపాటు రిలే నిరాహారదీక్షలు చేశారు. హైదరబాద్‌లో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ని కలసి సమస్యను విన్నవించారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమ రద్దుకి సహకరిస్తానని హామీ ఇచ్చారు. పనిమానుకుని చేస్తున్న దీక్షవిరమించాలన్న సంపత్‌కుమార్ సూచనతో స్థానికులు వెనక్కితగ్గారు. అప్పటి నుంచి పరిశ్రమ వద్ద ఎలాంటి అలికిడి లేదు. కానీ మంగళవారం రాత్రి పెద్దఎత్తున కంటైనర్లు, గుడారాలు,వాహనాలు దిగి పనులు ప్రారంభించడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ గుండంపెల్లి మధ్య నిర్మించతలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును స్థానికుల ఆందోళన మేరకు రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.



# పేదల జీవితాల్లో సుస్థిరత ప్రభుత్వ లక్ష్యం

- అర్హత కలిగిన పేద కుటుంబానికి పథకాలు
- కొడకండ్ల, దేవరుప్పలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలపంపిణీ
- పేదలకు న్యాయం చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వమే,
- లబ్ధిదారుల కండ్లలో నూతన ఉత్తేజం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి, విశాలభారతి:

పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండల కేంద్రంలో భ్రమరాంబ ఫంక్షన్ హాల్ లో అదే విధంగా దేవరుప్పుల మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్లో జరిగిన కార్యక్రమంలో దేవరుప్పుల మండలానికి చెందిన పలు గ్రామాల పేద లబ్ధిదారులకు బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి స్వయంగా లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..ఇల్లు అనేది ప్రతి మనిషి కల. ఆ కలను సాకారం చేయడమే ఇందిరమ్మ హౌసింగ్ పథక లక్ష్యం. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచి, గృహ నిర్మాణానికి ఈ మంజూరు పత్రాలు అండగా ఉంటాయి. ఇదే చైతన్యంతో పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఇల్లు అందించాలన్నదే మా సంకల్పం. పేదల జీవితాల్లో సుస్థిరత ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజల మద్దతుతో ప్రభుత్వ పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేస్తాం అని తెలిపారు.

దేవరుప్పుల కార్యక్రమంలో

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతోంది. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం అని పేర్కొన్నారు. పేదల జీవితాల్లో సుస్థిరత తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.ఇందిరమ్మ పథకం ద్వారా పేదల ఇంటి కల నెరవేరుతోందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఇల్లు కేవలం నివాస స్థలం మాత్రమే కాదు, అది ఒక కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్తు ప్రతి లబ్ధిదారుని జీవితంలో ఇది కొత్త ప్రారంభం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు. పత్రాలు అందుకున్న లబ్ధిదారులు, తమ జీవితాల్లో ఇది ఓ మైలురాయిగా నిలుస్తుందని భావిస్తూ, ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
05.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

విశాలభారతి, స్టేట్ బ్యూరో:తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. నోటిఫికేషన్‌లో ఈ నెల 15 నుంచి ప్రారంభం అవుతాయని పేర్కొన్నప్పటికీ 18వ తేదీ నుంచి నిర్వహిస్తుండటం గమనార్హం. ఈ మేరకు తాజాగా పరీక్షల నిర్వహణ తేదీలు, సెషన్లు, సబ్జెక్టులు, జిల్లాల వివరాలతో పాఠశాల విద్యాశాఖ అధికారులు పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 9 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌కు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ దరఖాస్తులు స్వీకరించారు. రాష్ట్రంలో సంవత్సరంలో రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని గత సంవత్సరం జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గత సంవత్సరం డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం జనవరి నెలలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన టెట్ పరీక్షకు 2.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 2 లక్షల మందికి పైగా పరీక్షకు హాజరయ్యారు. ఈసారి మాత్రం 1,83,653 దరఖాస్తులే వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పేపర్ 1కు 63,261మంది, పేపర్-2కు 1,20,392మంది దరఖాస్తు చేసుకున్నారు. 2 పేపర్లకు దరఖాస్తు చేసినవారు 15,000 మంది వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# GENERAL NEWS



## గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చెయ్యాలి

- హయత్ నగర్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని హయత్ నగర్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రేమ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు హయత్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ మాట్లాడుతూ, బక్రీద్ పండగ సందర్భంగా ఎక్కడ కూడా గోవధ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హయత్ నగర్ డివిజన్ నగర్ నగర శివారులో ఉండడం మరియు ఓఆర్ఆర్ సమీపంలో ఉన్నందువల్ల గతంలో అక్రమంగా తరలిస్తున్న చాలా గోవులను పట్టుకొని పోలీస్ శాఖకి అప్పగించినట్లు పేర్కొన్నారు. నగరంలో ప్రవేశించడానికి ప్రముఖ మార్గం కావడంతో డివిజన్ శివారులో ప్రత్యేకమైన చెక్ పోస్టు ఏర్పాటు చేసి గోవుల తరలింపును అడ్డుకొని, ఎక్కడ కూడా గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీను , జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ ,నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ , వస్పరి వెంకటేష్, పిట్టల మహేష్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## పేద ప్రజలు ఆత్మీయ బంధువు రావినారాయణ రెడ్డి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి 118వ జయంతి వేడుకలను సిపిఐ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్ మెట్టు మండల్, రావి నారాయణరెడ్డి కాలనీ 3 లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ పేద ప్రజల ఆత్మీయ బంధువు గుండెల్లో రావి నారాయణరెడ్డి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోరాటాలను గుర్తు చేసుకొని కొనియాడారు.అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ సైదులు ముదిరాజ్ గోపి నవనీత వీరేష్ తో పాటు సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## మానవతా దృక్పథంతో రోగులకు సేవలందించాలి

- హుజూరాబాద్ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ వెంటనే ప్రారంభించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**హుజూరాబాద్,విశాలభారతి:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు.డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, వార్డులు, ఓపి విభాగం సందర్శించి ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ....ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది ఖాళీల వివరాలుసమర్పించాలన్నారు



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని,సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని, వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు.ఆప్తమాలజిస్ట్, రేడియాలజిస్ట్, డెంటిస్ట్ వంటి విభాగాల వారీగా ఓపి సంఖ్యను పరిశీలించారు. నెలవారి నివేదికలను సమీక్షించారు.హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ క్యాంపును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.ఈ క్యాంప్ ద్వారా సుమారు 50 వేల రూపాయల ఖరీదు చేసే 47 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్న విషయం మహిళల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు.108 సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డి సి హెచ్ చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, ఆర్ఎంవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో చందు, ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు అడ్డుకునేదెవరు ?

- అక్రమ వసూళ్లపైనే అధికారుల దృష్టి
- అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం
- ఇష్టారీతిలో భవన నిర్మాణాలు , ప్రభుత్వ ఆదాయానికి గండి
- అక్రమ నిర్మాణ దారులకు అధికారుల వత్తాసు






**ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్ పేట,విశాలభారతి:** నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా తయారైంది అబ్దుల్లాపూర్ మెట్ మండలం పరిస్థితి. ఈ పరిధిలో అక్రమ, అనధికార, అదనపు అంతస్థుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. జీ ప్లస్ టూ నిర్మాణం మాత్రమే పర్మిషన్లు ఉన్న నాలుగు నుండి ఆరు అంతస్తులు ఎలాంటి పరిమితులు లేకుండా ఇష్టరీతిలో నిర్మాణాలు చేపడుతున్నారు. మండలంలోని ప్రధాన గ్రామం అబ్దుల్లాపూర్ మెట్ గ్రామంలో అవినీతి పెచ్చుమీరింది. పాలన పూర్తిగా గాడి తప్పడంతో ఇక్కడి అధికారులకు అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మండలంలో వెలుస్తున్న అనధికారిక నిర్మాణాలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మండలం పరిధిలోని గ్రామాల్లో వందకు పైగా అనధికార భవన నిర్మాణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి భవనాలే అవినీతి అధికారులకు వరంగా మారాయి. దీనిపై ఉన్నతాధికారుల వరకు మామూళ్లు వెళుతున్న కారణంగా అనుమతి తీసుకోకుండా నిరభ్యంతరంగా నిర్మిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.

**సెల్లార్ నిర్మాణం.. ఎవరిచ్చారు అధికారం**

ఆ భవన అంతస్తుల భవనాలలో సెట్ బ్యాకు లేకపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సెల్లార్ నిర్మాణం అసలు పరిమిషన్లు లేకున్నా ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా సాగుతున్న నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. సిబ్బంది కొన్ని సార్లు అక్రమ నిర్మాణాలకు నోటీసులిచ్చి హడావిడి చేసి వెళ్లిపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**మామూళ్ల మత్తులో..**

నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా అక్రమంగా పెద్ద భవనాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదు. కానీ సామాన్యులు, మధ్యతరగతి వారు నిర్మిస్తున్న చిన్న చిన్న నిర్మాణాలపై అధికారులు ప్రతాపం చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు అందినకాడికి దండుకుని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు మాత్రం యథావిధిగా సాగుతున్నాయి. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలకు కొంత మంది రాజకీయ నేతలు అండగా నిలుస్తుండడంతో చర్యలు తీసుకునేందుకు సిబ్బంది జంకుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి





## మార్చి 1నుంచి జనగణన

తరువాయి భాగం

వివరాలతో 2025 జూన్ 16న అధికారిక గెజిట్‌ను భారత ప్రభుత్వం ప్రచురిస్తుందని తెలుస్తోంది. 1948 జనాభా లెక్కల చట్టం, 1990 జనాభా లెక్కల నియమాల ప్రకారం ప్రతి పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తుంటారు. 2027లో జనగణనతో పాటే కులగణన నిర్వహిస్తారు. జాతీయ జనాభా లెక్కల ప్రక్రియలో కులాల గణనను భాగంగా చేయడం ఇదే తొలిసారి. కులగణన సమాచారం ఆధారంగా భారత ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను తీసుకోవచ్చని రాజకీయ పార్టీలు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు వాదించాయి. ఆ మేరకు ప్రభుత్వ విధానపరమైన ప్రణాళికలను, సంక్షేమ కార్యక్రమాలను రూపొందించొచ్చని సూచించాయి. ఈ నేపథ్యంలో జనగణనతో పాటే కులగణన నిర్వహణకు అంగీకారం తెలుపుతూ కేంద్ర సర్కారు నుంచి ప్రకటన వెలువడింది. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. 2010లో రూపొందించిన ఇళ్ల జాబితా ప్రకారం 2011 తొలినాళ్లలో జనగణనను నిర్వహించారు. 2011లో జరిగిన జనగణన ప్రకారం మన దేశ జనాభా 121 కోట్లకుపైనే. జనాభా 17.7 శాతం మేర పెరిగిందని అప్పట్లో గుర్తించారు. 2021లోనూ జనగణన నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. 2020 ఏప్రిల్ నుంచి సమాచార సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని భావించారు. అయితే కరోనా మహమ్మారి వ్యాప్తి, లాక్‌డౌన్ల నేపథ్యంలో ఆ ప్రక్రియను వాయిదా వేశారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన 2027లో జనగణన ప్రక్రియ పూర్తయ్యాక ఆ సమాచారం ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేసే అవకాశం ఉంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను కొత్త జనసంఖ్యకు అనుగుణంగా అప్‌డేట్ చేస్తారు. దీంతో వివిధ రాష్ట్రాల్లోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యలోనూ మార్పు రానుంది. ప్రతి ఎంపీ లేదా ఎమ్మెల్యే దాదాపు ఒకే సంఖ్యలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించేలా ఈ మార్పులు జరుగుతాయి. రాజ్యాంగం ప్రకారం ప్రతీ జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. కానీ 1976 నుంచి ఈ ప్రక్రియను ఆపేశారు. దీనికి కారణం అప్పట్లో భారత ప్రభుత్వం జనాభా నియంత్రణను ప్రోత్సహించాలని భావించింది. అధిక జనన రేటు కలిగిన రాష్ట్రాలు ఎక్కువగా ఉత్తరాదిలో ఉన్నాయి. జనాభాను నియంత్రణలో ఉంచిన దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలు ఎక్కువ లోక్‌సభ, అసెంబ్లీ సీట్లను పొందకుండా నిరోధించాలని నాటి కేంద్ర సర్కారు కోరుకుంది.నియోజకవర్గాల పునర్విభజనపై ఉన్న ఫ్రీజ్ తొలుత 1976 నుంచి 2001 వరకు అమలైంది. 2001లో జనగణన నిర్వహించిన తర్వాత నియోజకవర్గ సరిహద్దులు, ఎస్సీ, ఎస్టీల రిజర్వ్ సీట్ల సంఖ్యను అప్‌డేట్ చేశారు. అంతే తప్ప మొత్తం సీట్ల సంఖ్యను మార్చలేదు. 2001 అనంతరం ఈ ఫ్రీజ్ వ్యవధిని 2026 వరకు పొడిగించారు. 2026లో ఆ ఫ్రీజ్ తొలగిపోనుంది. అందుకే 2027లో జనగణన నిర్వహించి, ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేసే అవకాశం ఉంది. 1971 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. నాటితో పోలిస్తే, మన దేశ జనాభా రెట్టింపు అయింది. ఆ మేరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 848కి పెరగొచ్చని 2019లో నిర్వహించిన ఒక అధ్యయనంలో గుర్తించారు. 888 మంది ఎంపీలకు సీట్లతో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించారు. ఆమేరకు భవిష్యత్తులో సీట్లు పెరుగుతాయని పరిశీలకులు భావిస్తున్నారు. లోక్‌సభ సీట్ల పెంపు అంత భారీ స్థాయిలో జరగాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుత లోక్‌సభ సీట్ల పరిమితి 550 మాత్రమే.

**దక్షిణాది రాష్ట్రాలకు నష్టం- 26 సీట్లు మైనస్**

ఈసారి నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లాంటి దక్షిణాది రాష్ట్రాలు 26 లోక్‌సభ సీట్లను కోల్పోతాయనే అంచనాలు వెలువడుతున్నాయి. ఇక ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో మరో 31 లోక్‌సభ రగొచ్చని అంచనా వేస్తున్నారు. అత్యధిక జనాభా ఉన్నందున ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతున్నాయి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
05.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily

### స్కూటీ నడిపిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**దేవరుప్పుల, విశాలభారతి:**
మండలకేంద్రంలోని తిరుమల గార్డెన్ లో పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను అందజేసేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి తిరుమల గార్డెన్ వరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల కోరిక మేరకు వారిని ఉత్తేజపరిచేందుకు స్కూటీ నడిపారు.





# సీఎం సహాయ నిధి... పేదలకు పెన్నిధి

- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట,విశాలభారతి:**
సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా



కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నమన్నారు.ఈ నేపథ్యంలో సూర్యాపేట మండలం 03,ఆత్మకూర్05, పెన్ పహాడ్04,చివ్వేంల06, సూర్యాపేట పట్టణం 20 మంది లబ్దిదారులకు మొత్తం 38 చెక్కులు 15 లక్షల 9500 రూపాయల విలువ చేసే చెక్కులను రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన రోజు నుండి ఇప్పటివరకు సూర్యాపేట నియోజకవర్గానికి మొత్తం 87 మంది లబ్ధిదారులకు 34 లక్షల 9500 విలువ చేసే చెక్కులు అందించామన్నారు.అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం రేవంత్ రెడ్డి అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, చింతమల్ల రమేష్, తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ,దివ్య, మందాడి శేఖర్,నాగుల వాసు,మద్దెబోయిన శ్రీనివాస్, తంగెళ్ల కర్ణాకర్ రెడ్డి, సిరివెళ్ల శబరినాథ్,అనంతుల యాదగిరి, మాద నవీన్, పందిరి మల్లేష్, గండూరి రమేష్, గద్దల శిరీష శేఖర్,అంతటి పాపయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలి

- నకిలీ విత్తనాల దందాను అరికట్టాలి
- సామాజిక కార్యకర్త కర్నె రవి



**మణుగూరు, విశాలభారతి:**
తొలకరి ముందు గానే ప్రారంభమైనందున రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో పాటు మార్కెట్ లో నకిలీ విత్తనాలను అరికట్టాలని, సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నె రవి అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులు తమ వ్యవసాయ భూముల్లో దుక్కులు దున్ని సిద్దంగా ఉన్నందున అన్ని రకాలనాణ్య మైన విత్తనాలను ప్రభుత్వం అందించాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పటిష్టమైన విజిలెన్స్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందించి, వ్యవసాయ క్యాలెండర్ ప్రకటించి గ్రామాలలో పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామాల లో పంటలవారీగా ప్రణాళికను రూపొందించాలని కోరారు. రైతు లకు అన్ని రకాల ఎరువులను, పురుగుల మందులను సబ్సిడీపై అందించాలన్నారు. పాసుబు క్కు కలిగిన ప్రతి రైతుకు ఖరీఫ్ సాగు కోసం పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ పంట సాగు కోసం ప్రభుత్వం రైతు భరోసా ను పాస్ బుక్ కలిగిన ప్రతి రైతుకు రైతు భరోసా నగదును బ్యాంకు ల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్లో ఉన్న రైతు భరోసాను వెంటనే అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న భూభారతి అమలుకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులపై విస్తృత ప్రచారం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యమును అమ్మిన రైతులకు వెంటనే రైతు ఖాతాలలో డబ్బులను జమచేసి అన్ని రకాల ధాన్యముకు ప్రభుత్వ ప్రకటించిన బోనస్ ను ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు.



## రైతుల దరఖాస్తులను స్వీకరించిన తహసీల్దార్ ఆండాలు

**దేవరుప్పుల, విశాలభారతి:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టం అమలులోకి రాగా భూభారతి చట్టాన్ని ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే దేవరుప్పుల మండలం, మన్ పహాడ్ గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు మండల తహసీల్దార్ ఆండాలు సదస్సు నిర్వహించి భూభారతిలో ప్రజల,రైతులసందేహాలను,అనుమానాలను నివృత్తి చేసి రైతుల దరఖాస్తులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయ్ కుమార్,ఆర్ఐ రాజు,జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.



## మహిళలను లక్షాధికారులను చేయాలనేదే లక్ష్యం

- ఎమ్మెల్యే యశస్వినీ

**దేవరుప్పుల, విశాలభారతి:**
మండలకేంద్రంలోని తిరుమల గార్డెన్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరుప్పుల మండలంలో 279 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఇవ్వడం జరిగిందని,ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎవరు ఏ పార్టీ అనేది చూడకుండా అర్హులైన ప్రతీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ,ఇది నిరంతర ప్రక్రియని,రానున్న రోజులలో 7000 ఇండ్లు నియోజకవర్గానికి వస్తాయని ,మహిళలను లక్షాధికారులను చేయాలనే ఆశయంతో ముందుకు వెళ్తున్నది మన కాంగ్రెస్ ప్రభుత్వమని,మీరు ఇల్లు కట్టుకంటే చాలు అదే మాకు సంతోషమని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రావు, మండల తహసీల్దార్ ఆండాలు,ఎంపిడిఓ లక్ష్మీనారాయణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,జిల్లా నాయకుడు కాసారపు ధర్మారెడ్డి,యూత్ మండల అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ అధ్యక్షులు,ఆయా గ్రామాల అధ్యక్షులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా నాయకురాల్లు,యువజన నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ సహాయంతో మండలంలో బోర్లు

- ప్రజల దాహార్తి తీర్చిన కేంద్రమంత్రి
- బిజెపి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్

**విశాలభారతి,ఎల్కతుర్తి:**
ఎల్కతుర్తి మండలంలోని దామెర ఎల్కతుర్తి గోపాల్పూర్ గ్రామాల్లో నీటికొరత ఉన్నందున స్థానికబీజేపీ నాయకులు గ్రామల సమస్యలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కి తెలిపారు.దాంతో స్పందించిన బండి సంజయ్ మండలంలోని పలు గ్రామాల్లో వెంటనే బోర్లు వేసి నీటి కొరత తీర్చాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని గ్రా



మాల్లో బోరు బావులకి ఎల్కతుర్తి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కొబ్బరికాయ కొట్టి బోర్లను స్టార్ట్ చేశారు. గ్రామంలోని ప్రజల దాహమ్ తీర్చడానికి బోర్లు వేస్తున్నదుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.




## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్.

**సూర్యాపేట,విశాలభారతి:**
100 రోజుల ప్రణాళికలో భాగంగా 3 వ రోజు సూర్యాపేట పట్టణంలోని 3 వ వార్డు బిబి గూడెం నందు బుధవారం తడి చెత్త పొడి చెత్త వేరు చేయు కార్యక్రమంపై అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరు ఆయిన మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. అదే విధంగా గృహ,వాణిజ్య ,వ్యాపార సంస్థల వారు తమ ఇండ్లలోని చెత్తను తడి ,పొడి,హానికర మయిన చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు,వీధుల లో సంచరించు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని పెంపుడు కుక్కల మెడకు బెల్ట్ లు, టీకాలు వేయించాలి అన్నారు. వార్డు లో మున్సిపాల్టీ సరఫరా చేయు నీటి ని టెస్టింగ్ చేయించుట జరిగింది.నిరుపేద మహిళలను గుర్తించి వారిని స్వయం సహాయక గ్రూప్ గా ఏర్పాటు చేయుటకు మహిళలకు అవగాహన కల్పించుట జరిగింది.చిరు వ్యాపారాలు చేసుకొనే వారికీ గుర్తించి స్ట్రీట్ వెండర్ సంఘలు చేయుటకు ప్రతి పాదనలు తీసుకోవడం జరిగిందని, వ్యాపార సంస్థలను గుర్తించి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయడంతో పాటు రానున్న వర్షా కాలం ను దృష్టిలో పెట్టుకొని శిధిలావస్తలో కూలి పోవడానికి సిద్ధంగా వున్న భవనాల వారికీ నోటీసు లు జారీచేయుట జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీ.ఇ సత్యారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఇ తిరుమలయ్య , యాదగిరి ,టీఎంసీ శ్వేత,వార్డ్ అధికారి ఎడ్ల వినోద్ ,ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ శివ ప్రసాద్,వసీం తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు,దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర ,విశాలభారతి:**
భూత్పూర్ మండలం కరివేన గ్రామంలో భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులో జిల్ల అధికారులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో కలిసి పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల భూములకు భరోసా కల్పించే చట్టం భూభారతి చట్టమని అన్నారు. భూ భారతి చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.చట్టాలు చేస్తే ప్రజల మేలు కోసం ఉండాలి గాని ప్రజలపై పెత్తనం చేసేలా ఉండకూడదని ధరణిని ఉద్దేశించి విమర్శించారు.ఎన్నికల ముందు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ.రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన మాట ప్రకారం ధరణిని బంగాళాఖాతంలో



కలిపి ఆ స్థానంలో కొత్త చట్టం తీసుకొస్తామని చెప్పి,భూభారతి చట్టం అమలు చేశారని పేర్కొన్నారు.గతంలో రైతులు ధరణి పోర్టల్ ద్వారా చాలా ఇబ్బందులు అనుభవించారని, కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగారని,అధికారులు కూడా నిస్సహాయంగా ఉండిపోయారని అన్నారు. ఈ దుస్థితిని మారుస్తూ,పేద రైతుల కన్నీళ్లను తుడిచే ఉద్దేశ్యంతో భూభారతిని అమలులోకి తెచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## భారాన్ని మించిన మానవత్వం

- చూపరుల కంట ఆగని కన్నీరు.
- చలించిన బంధువుల హృదయాలు.

**సూర్యాపేట,విశాలభారతి:**
మానవత్వం పరిమళించే మంచి మనిషికి (మంచి నాయకులకు) స్వాగతం అనే సినిమా పాట వీరికి తగ్గట్టుగా ఉంది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్టు కొండ్లె కృష్ణయ్య మాతృమూర్తి చనిపోగా బుధవారం అంత్యక్రియలకు హాజరైన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, 39 వ వార్డు ఇన్చార్జి గడ్డం వెంకన్న లు ఆమె పాడెను మోస్తూ ఉండగా చూపరుల, బంధువుల హృదయాలు చలించి కంట కన్నీరును తెప్పించాయి. చూడటానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇలా సహాయం చేయడంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఎక్కడ అంత్యక్రియలకు వెళ్లిన కూడా ఇలాంటి పుణ్యం, గొప్ప సహాయం చేస్తుండటం అందరికీ తెలిసిన విషయమే.దామన్న శిష్యులుగా పేరున్న నాయకులు ఆయనని ఆదర్శంగా తీసుకొని ఇలాంటి పుణ్య కార్యక్రమాలు చేయడం అరుదుగా కనిపిస్తూ ఉంటారు. ఏది ఏమైనా వీరికి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.




## రైతు సంక్షేమం కోసం రైతు బజార్

- రైతు వేదికలో రైతులకు క్వాలిటీ విత్తనాలు పంపిణీ
- యాచారంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**
రైతు సంక్షేమం కోసం యాచారంలో సకల హంగులతో నూతన రైతు బజార్ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు క్వాలిటీ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం యాచారంలో రైతు బజార్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు నేరుగా ఇక్కడే అమ్ముకునేందుకు రైతు బజార్ ఉపయోగపడుతుందన్నారు. ఫార్మసిటీనీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఫార్మా కోసం సేకరించిన భూముల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా భూసేకరణ చేపట్టబోమన్నారు. అవసరమైతే రైతుల ఇష్టంతో ఇస్తే ప్రస్తుత ధరను పరిహారం కింద చెల్లిస్తామన్నారు. ఫ్యూచర్ సిటీతో యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. మండలాన్ని కూరగాయల హబ్గా మార్చనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఆర్డీఓ అనంతరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడిఏ సుజాత, తాహసిల్దార్ అయ్యప్ప, వ్యవసాయ శాఖ ఏవో రవినాథ్, రైతు కమిషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు..

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం,
05.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
5
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



# లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆలె నరసింహ నియామకం.

ఎల్బీనగర్, విశాలభారతి

జాతీయ లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ (LIO) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆలె నరసింహ ని నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి పొన్నం రవీందర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమం, లీగల్ అవేర్‌నెస్, న్యాయ సలహా శిబిరాలు, లీగల్ సెమినార్లు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాల దాఖలు, అధికార మరియు న్యాయ వ్యవస్థలపై వినతుల సమర్పణ తదితర అంశాల్లో సంస్థ విస్తృతంగా కార్యాచరణ చేపట్టనున్నదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా, రాష్ట్రంలోని జిల్లాల వారీగా న్యాయవాదుల లీగల్ కమిటీల్లో స్థానిక న్యాయవాదులను నియమించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు.

## స్కూలు యూనిఫాంలు పంపిణీ



రంగారెడ్డి,విశాలభారతి:

రాజేంద్రనగర్ మండల పరిధిలో ఉన్న 46 ప్రభుత్వ ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10,035 స్కూలు యూనిఫాంలు యుసిడి,జి హెచ్ ఎంసి,రాజేంద్ర నగర్, పివో.ఏ స్వాతి సివో ల ఆధ్వర్యంలో సకాలంలో పాఠశాలలకు అందజేయడం జరిగింది.

# ప్రభుత్వ విద్య సంస్థలలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్
- ఈ మేరకు వరంగల్ డీఈవో జ్ఞానేశ్వర్ కి వినతిపత్రం అందజేత

హనుమకొండ,విశాలభారతి:





ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా డీ ఈవో జ్ఞానేశ్వర్ కి ప్రభుత్వ విద్యా సంస్థలల్లో సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పిడిఎస్యు ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ...కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ విద్య సంస్థల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని,విద్యార్థులు లేరని సాకుతో 2000 ప్రభుత్వ పాఠశాలలో మూసివేయాలని ప్రభుత్వం పూనుకుంటుందని ఇలాంటి ఆలోచన లను మానుకోవాలని, అలాగే కార్పొరేటర్ ప్రైవేట్ పాఠశాలలో యజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ విచ్చలవిడిగా పాఠశాలలు నెలకొల్పుతున్నారని అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వారి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ,విద్య హక్కు చట్టం అమలు చేయాలని,ప్రతి పాఠశాలలో చట్ట ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత అడ్మిషన్లు ఇచ్చేలాగా కార్పొరేట్ ప్రైవేటు ప్రతి విద్యా సంస్థల్లో చర్యలు తీసుకోవాలని ,కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థలలో ఫీజు నియంత్రణ కొరకు ఈ ఏడాది ఫీజు నియంత్రణ పై చర్యలు తీసుకోవాలి అని డీఈవో ని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్ రాజేష్ అనిల్ అనిల్ పాల్గొన్నారు.





# గీతం అధ్యాపకురాలు ఝాన్సీకి పీహెచ్డీ

- జేఎన్ టీయూ హైదరాబాద్ స్నాతకోత్సవంలో ఉప కులపతి చేతుల మీదుగా ప్రదానం

పటాన్ చెరు,విశాలభారతి

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఝాన్సీ రాణి తిరుమలశెట్టి, హైదరాబాదులోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం (జేఎన్ టీయూహెచ్) నుంచి సీఎస్ఈలో ప్రతిష్టాత్మక డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్డీ) డిగ్రీని పొందారు. జేఎన్ టీయూ 13వ స్నాతకోత్సవంలో, జేఎన్ టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఈ డిగ్రీని ఝాన్సీ అందుకున్నారు. జేఎన్ టీయూ కులపతి, తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీయూ) చైర్మన్ ప్రొఫెసర్ టీ.జీ. సీతారాంల సమక్షంలో ఈ పట్టాను ప్రదానం చేశారు. ట్వీట్ల సెంటిమెంటును విశ్లేషించడానికి మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) అల్గోరిథంల అభివృద్ధి అనే అంశంపై ఝాన్సీ చేసిన పరిశోధన, కృత్రిమ మేధస్సు (ఏఐ), సెంటిమెంట్ విశేషణ రంగానికి గణనీయమైన సహకారాన్ని సూచిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లలో వ్యక్తీకరించిన ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడానికి నూతన మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ ల రూపకల్పన, అమలుపై ఆమె అధ్యయనం చేశారు. జేఎన్ టీయూ నుంచి పీహెచ్డీ పట్టా పొందిన ఝాన్సీ రాణిని గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.



# శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

- ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు తెల్ల హరికృష్ణ

కూకట్ పల్లి,విశాలభారతి:

కూకట్‌పల్లి లోని మూసాపేట్ గూడ్స్ రోడ్ ఈనాడు ఆఫీస్ వద్ద శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ పూజా కార్యక్రమానికి రాష్ట్ర బీసీ నాయకులు తెల్ల హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జిల్ల జీత్ రావు,జిల్ల బాబురావు, జిల్లా వెంకటేష్,జిల్ల సంజీవ్, జిల్ల గోపాల్,జిల్ల మధుల ఆహ్వానం మేరకు శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ఎల్లమ్మ, శ్రీ బంగారు మైసమ్మ,శ్రీ ముత్యాలమ్మ, శ్రీ ఉప్పలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నందుకు హరికృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తెల్ల హరికృష్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయ మిత్రులు ఇప్ప రాకేష్, దాడే వెంకట్, ముని, నాయకులు గొర్ల శంకర్ రావు, కే.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష

- మరొకరికి ఒకరోజు జైలు శిక్ష.
- ఎనిమిది మందికి జరిమనా.
- సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం.

సూర్యాపేట,విశాలభారతి:

మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ ఐ పిఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ పది మంది పట్టుబడినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు. పట్టుబడిన వారిని బుధవారం కోర్టులో హాజరు పరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒక్కరికి మూడు రోజుల జైలు శిక్ష, రెండు వేల జరిమానా, మరొకరికి ఒకరోజు జైలు శిక్ష, 4 వేల జరిమానా,అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా ఎనిమిది మందికి కలిపి రూ.9 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాల్లో

# ఫీజులు నియంత్రించాలి

- నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్

పటాన్ చెరు,విశాలభారతి



ప్రైవేటు కళాశాలల్లో, పాఠశాలల్లో ఫీజులను కట్టడి చేయాలని నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ డిమాండ్ చేశారు. డొనేషన్ అడ్మిషన్ పేరుతో ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల తల్లితండ్రుల నుండి విపరీతమైన డబ్బులు వసూలు చేసి చదువును వ్యాపారంగా మర్చుతున్నారని ఆరోపించారు. ఫీజులు, యూనిఫాం పుస్తకాల పేరిట మోయలేని ఆర్థికభారాన్ని మోపుతూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తు ఎవరికి వారు ఇష్టరాజ్యాంగ వ్యవహరిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రవేటు పాఠశాలలు ఇష్టారీతిన ఫీజులు పెంచుతూ విద్యను వ్యాపారంగా మారిస్తే దేశభవిష్యత్ ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యాహక్కు చట్టాన్ని అమలుపరిచి ప్రవేటు కళాశాలలను పాఠశాలలను కట్టడి చేయాలని మెట్టుశ్రీధర్ డిమాండ్ చేశారు.



# ఉత్తరా నక్షత్రం సందర్భంగా అల్పాహారం పంపిణి

సూర్యాపేట,విశాలభారతి:

అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు రంగు ముత్యంరాజు స్వాతి దంపతులు అల్పాహారం పంపిణి చేశారు.సూర్యాపేట పట్టణంలోని వివిధ కూడళ్ళలో,దేవాలయం వద్ద ఉండే అబాగ్యులకు, నిరాశ్రయులకు అల్పాహారం, వాటర్ బాటిల్, బిస్కెట్ లు అందజేశారు.ఈ సందర్భంగా రంగు ముత్యంరాజు మాట్లాడుతూ ఈ వర్షకాలంలో వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు బాగా పండాలని ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకొంటూ నిరాశ్రాయులకు అల్పాహారం పంపిణి చేశామన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా భావనతో పనిచేయాలని,నిరాశ్రయులను చేరాదీసి మనకు తోచిన సహాయం చేయాలనీ అప్పుడే దైవ అనుగ్రహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో రంగు సాయిప్రీతి ఉన్నారు.



# సతీష్ మ్యూజిక్ అకాడమీ లోగో ఆవిష్కరణ

- తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా మామిడి హరికృష్ణ


గరిడేపల్లి, విశాలాభారతి:

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని అప్పన్నపేట గ్రామానికి డప్పు కళాకారుడు & జానపద సామ్రాట్ అవార్డు గ్రహీత అమరవరపు సతీష్. సతీష్ మ్యూజిక్ అకాడమీ అనే సంస్థను నూతనంగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. అట్టి మ్యూజిక్ అకాడమీ లోగో ను తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా,మామిడి హరికృష్ణ కళాకారుల కళా నిలయం రవీంద్ర భారతి కార్యాలయంలో ఆవిష్కరణ చేసి డప్పు కళాకారుడు సతీష్ మరియు వారి బృందానికి అభినందనలు తెలపడం జరిగింది. డైరెక్టర్ డా,, మామిడి హరికృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మంచి మంచి కార్యకమాలు చేస్తూ, ఇంకా ఎన్నో గొప్ప అవార్డులు అందుకోవాలని కొనియాడారు.ఇట్టి కార్యక్రమంలో అమరవరపు సతీష్ తో పాటు వారి బృందం సభ్యులు కల్పనా, స్వరూప, సుజాత, నాగమణి, రాణి, అపర్ణ, సలోమి, మరియమ్మ, ధనమ్మ, వీరబాబు, శోభన్, అనురాధ,ఉపేంద్ర, సునీత, శారదా, భువనేశ్వరి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా,ఓటర్ల ఆధారంగా వార్డుల విభజన

మద్దూర్, విశాలభారతి:

మద్దూర్ పురపాలక సంఘం పరిధిలోని జనాభా మరియు ఓటర్ల ప్రతిపాదన ఆధారంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 16 వార్డులుగా డ్రాఫ్ట్ ప్రతిపాదనలను విభజించడం జరిగింది అని మద్దూర్ మున్సిపల్ కమిషనర్ తెలియజేయడం జరిగింది. కావున పట్టణ ప్రజలకు ఏలాంటి ఆక్షేపణలు ఉన్న,సలహాలు మరియు సూచనలు ఉన్న జూన్ 5 నుండి జూన్ 11 వ తేదీ వరకు పురపాలక సంఘం,మద్దూర్ కార్యాలయంలో వ్రాత పూర్వకంగా ఇవ్వగలరని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు.



పురపాలక సంఘ కార్యాలయము : మద్దూర్
జిల్లా :: నారాయణపేట్

:: పత్రిక ప్రకటన ::

లేఖ నం.G1/37/MCM/2025 ,Date: 03.06.2025

ప్రభుత్వం ఉత్తర్వు నం. G.O.Rt.269,Dated:29/05/2025 మరియు ప్రభుత్వ ఉత్త... 12/MA&UD (MA) తేది 30.01.2021,ప్రకారము మొత్తం మద్దూర్ పురపాలక సం...ధి లోని జనభా మరియు ఓటర్ ల ప్రాతిపదికన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ...ర్డులుగా డ్రాఫ్ ప్రతిపాదనలను తయారు చేసి , తహసిల్దార్ కార్యలయము -మ...ండల ప్రజా పరిషత్ కార్యాలయము మద్దూర్ మరియు పురపాలక స...ర్యాలయము మాదూర్ మరియు వార్డు కార్యాలయాల నోటీసు బోర్డు ల య...చనైనది .

...వున పట్టణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ,ఈ ప్రకటన వెలువడిన (7) ...జులలో అనగా తేది : 05.06.2025 నుండి ,తేది :11.06.2025 లోపు తమరి ఆక్షేప...చనలు ,సలహాలు ఏమైనా ఉన్న యెడల వ్రాత పూర్వకముగా పురపాలక స...ర్యాలయము -మద్దూర్ లో ఇవ్వ గలరు .

ప్రతి :
...ప్రపోసల్ లిస్టు .

కమీషనర్
మద్దూర్ మున్సిపాలిటీ

# పట్టుదలతో విజయం సొంతం

మద్దూర్, విశాలభారతి:



తెలంగాణ అథ్లెటిక్స్ కోచెస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 11 వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ ఫర్ బాయ్స్ అండ్ గర్ల్స్ అండర్ 8,10,12 సంవత్సరాల విభాగంలో నిర్వహించిన పోటీలలో అండర్ 8 విభాగంలో 300 మీటర్స్ ఈవెంట్ లో మహిత d/o హన్మంతు కాంస్య పతకాన్ని సాధించడం జరిగింది.అదే విధంగా అండర్ 12 విభాగంలో అనిత d/o పెంటప్ప షార్ట్ పుట్ లో కాంస్య పతాకాన్ని సాధించడం జరిగింది. ఇందుకు గాను జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ రమణ పిఈటీ ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మద్దూర్ కోచ్ లు భాస్కర్,రాజు లు ఇద్దరు అమ్మాయిల విజయం పట్ల గర్వంగా ఉందని అభినందించారు. గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక





## ఊహించని జీవితం ఎంతో అద్భుతంగా!

హీరోయిన్ గా సక్సెస్ అవ్వాలంటే అందం.. అభినయం...ప్రతిభ మాత్రమే ఉంటే సరిపోవు. ఆ మూడింటికి అదృష్టం కూడా తోడవ్వాలి. అప్పుడే ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యేది. అనుకున్న గమ్యాన్ని చేరుకునేది. కొందరు ఎలాంటి గోల్స్ లేకుండానే వచ్చి సక్సస అవుతుంటారు. ఊహించని జీవితాన్ని చూస్తుంటారు. అలాంటి వాళ్లలో రష్మిక మందన్న ఒకరు అనడంలో ఎలాంటి సందేహం లేదు.ఎందుకంటే తాను ఏమాత్రం ఊహించని గొప్ప జీవితం తనకు దక్కిందని అమ్మడు గుర్తు చేసుకుంది. `కూర్గ్` అనే ఓ చిన్న ప్రాంతం నుంచి వచ్చిన తాను ఇంత గొప్ప నటిగా దేశ ప్రజల నీరాజనాలు అందుకుం టానని ఏ నాడు ఊహించలేదని తెలిపింది. కనీసం కలలో కూడా ఎప్పుడు కూడా అలాంటి జీవితాన్ని ఊహించుకోలేదంది. చదవు... ఆ తర్వాత మంచి ఉద్యోగం తప్ప ఇంకెలాంటి ఆలోచనలు లేకుండా ఉన్న తన జీవి తం ఇంత గొప్ప ఉంటుందని ఎన్నడు అనుకోలేదంది. అంతేగా `ఛలో` అనే సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై నేషనల్ క్రష్ గా మారింది. అక్కడ నుంచి `పుష్ప`, `యానిమల్` లాంటి విజయాలతో ఏకంగా పాన్ ఇండియాకి రీచ్ అయింది. ప్రస్తుతం బాలీవుడ్ లో హీరోయిన్గా వెలిగిపోతుంది. కోట్లాది రూపాయలు పారితోషికం తీసు కుంటుంది. ఖరీదైన జీవితం..కార్లు.విల్లాలు.... స్పెషల్ జెట్ లు. వ్యాపారాలు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ రష్మిక హీరోయిన్ అయిన తర్వాత సంపాదించిన ఆస్తులే కదా. అంత ఆస్తి సంపాదిస్తుందని తాను ఏనాడు ఊహించలేదు. ఇంతకు మించిన అదృష్టవంతురాలు ఇండస్ట్రీలో ఎవరుంటారు. రష్మికను సినిమాల్లోకి తీసుకోచ్చింది కన్నడ నటుడు రక్షిత్ శెట్టి. అతడితో కొన్నాళ్ల పాటు ప్రేమాయణం కూడా సాగిం చింది. అటుపై తాను పెద్ద స్టార్ అయిన తర్వాత ఆ ప్రేమకు పుల్ స్టాప్ పడిన సంగతి తెలిసిందే.



## నయనతారకు టాలీవుడ్డే ముద్దా?

లేడీ సూపర్ స్టార్ నయనతార మెగాస్టార్ చిరంజీవి 157వ సినిమా కోసం ప్రచార బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందే అమ్మడు ప్రచారం షురూ చేసింది. నయనతార నుంచి ఇది ఏ మాత్రం ఊహించనది. ఇంతకాలం ప్రచారానికి దూరంగా ఉన్న నయన్ ఒక్కసారిగా ప్రాజెక్ట్ మొదల వ్వడానికి ముందే బరిలోకి దిగడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. అందులోనూ తెలుగు సినిమాకు ప్రచారం చేయడం అన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీంతో నయన్ కోలీవుడ్ మీడియాలో వైరల్ గా మారింది. అమ్మడిని టార్గెట్ చేసి మరీ ట్రోల్ చేయడం మొదలు పెట్టారు. తమిళ సినిమా వదిలేసి తెలుగు సినిమాకు ప్రచారం చేయడం ఏంటి? అనే కశ్చన్ రెయిజ్ అయింది. ప్రతిగా నయన్ కూడా అంతే ధీటుగా బధులిచ్చింది. నిర్ణయాల విషయంలో తనకు మాత్రమే స్వేచ్ఛ ఉంటుందని...తనకు నచ్చిన నిర్మాతలకు మద్దతుగా నిలుస్తానని కుండబద్దలు కొట్టేసింది. దీంతో టాలీవుడ్ పై నయనతార ప్రేమ హైలైట్ అవ్వడం మొదలైంది. వాస్తవానికి నయన్ చాలా కాలంగా తెలుగు సినిమాలకు దూరంగానే ఉంది. అప్పడప్పుడు మంచి అవకాశాలు వస్తే నటించడం తప్ప చాలా అవకాశాలు వదులుకుకుంది. ఎక్కువగా తమిళల్లోనే నటించింది. అలాంటి నయన్ తమిళ సినిమా ప్రచారానికి దూరంగా ఉంటూ టాలీవుడ్ సినిమా ప్రచారాని సహకరించడంతో అరవ ఆడియన్స్ నుంచి వ్యతిరేక పవనాలు వీయడం మొదలైంది. దీంతో నయన్ కేవలం తెలుగు సినిమాలు మాత్రమే ప్రచారం చేస్తుందా? ఆ ప్రచారం 157 వరకే పరిమితం చేస్తుందా? తమిళ సినిమాలు ప్రచారం చేయదా? ఇలా ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో నయనతార క్లారిటీ ఇవ్వాలని సోషల్ మీడియా వేదికగా అడుగుతున్నారు. ఏదీ ఏమైనా నయన్ తెలుగు సినిమా ప్రచారం టాలీవుడ్ ఆడియన్స్ అన్ని రకాలుగా స్వాగతించదగినది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.